మళ్లీ వీఆర్వో వ్యవస్థ!

మొదటిపేజీ తరువాయి...

ఉన్నది. సర్వేయర్ల నియామకానిదీ ఇదే పరిస్థితి. సాంకేతికంగా ఉన్న అడ్డంకులను పట్టించుకోకుండా ఉద్యోగుల జీవితాలతో ఆడుకునే ప్రయత్నం చేస్తున్నది. మరోవైపు విద్యార్హతలతో సంబంధం లేకుండా నియామకాలు జరుపుతూ నిరుద్యోగులకు సైతం అన్యాయం చేస్తున్నది. గతంలో పనిచేసిన వారిలో ఎవరెవరు మళ్లీ గ్రామ రెవెన్యూ అధికారులుగా పనిచేయడానికి, సర్వేయర్లుగా పనిచేయడానికి సిద్ధంగా ఉన్నారో తెలపాలంటూ ఇటీవల సీసీఎల్ఏ ఉత్తర్వులు జారీచేశారు. ఈ ప్రక్రియను ఈ నెల 28లోగా ముగించాలని ఆదేశించారు. ఈ క్రమంలో ఉద్యోగుల్లో తలెత్తుతున్న అనుమానాలను నివృత్తి చేయడంలో ప్రభుత్వం విఫలమైంది. ఉన్నతాధికారులను అడిగితే మూడు నెలల్లో నియమ నిబంధనలు రూపొందిస్తారని, ఆ తర్వాతే 'ఏ పని, ఎంత జీతం?' వంటి వివరాలన్నీ తెలుస్తాయని సమాధానం ఇస్తున్నట్టు ఉద్యోగులు వాపోతున్నారు.

ఉద్యోగుల సందేహాలు

1) ఏం పని చేయాలి?

గతంలో ఉన్న వీఆర్వోలకు భూ రికార్డుల నిర్వహణతోపాటు అనేక విధులు ఉండేవి. వారికి ప్రత్యేకంగా జాబ్‌చార్టు ఉండేది. కానీ నూతన వీఆర్వో వ్యవస్థకు ఇప్పటివరకు జాబ్ చార్ట్‌నే నిర్ణయించలేదు. భూరికార్డులను నిర్వహిస్తారని, ఏటా జమాబందీ చేయాల్సి ఉంటుందని మాత్రమే చెప్పారు. మరి గతంలో ఉన్న మిగతా విధులు ఉన్నట్టా? లేనట్టా? అనేది అంతుచిక్కని ప్రశ్నగా మారింది. దీంతో ఏం పనిచేయాలో? కొత్త ఉద్యోగంలో పనిభారం ఎలా ఉంటుందో తెలియక పూర్వ వీఆర్వోలు, వీఆర్ఏలు గందరగోళానికి గురవుతున్నారు.

2) ఏ స్థాయి ఉద్యోగం?

గ్రామ రెవెన్యూ అధికారుల పోస్టులను ప్రభుత్వం ఇంకా మంజూరు చేయనేలేదు. ఈ పోస్టులను సృష్టించాలంటే రెవెన్యూ శాఖ నుంచి ప్రతిపాదనలు మొదలు అనేక ప్రక్రియలు ఉంటాయి. కానీ ఇప్పటివరకు ప్రభుత్వం బిల్లులో ప్రస్తావన తప్ప సాంకేతికంగా పోస్టుల మంజూరుపై కసరత్తు చేయలేదు. దీంతో కొత్తగా వచ్చే వీఆర్వో లది ఏ క్యాడర్ ఉద్యోగమో తెలియని పరిస్థితి. గతంలో వీఆర్వోలు, వీఆర్ఏలుగా పనిచేసిన వారిని ఇతర శాఖల్లోకి బదిలీ చేసినప్పుడు ఇంటర్, డిగ్రీ అర్హత ఉన్నవారిని జూనియర్ అసిస్టెంట్లుగా, పదో తరగతి, ఆలోపు అర్హత ఉన్నవారిని ఆఫీస్ సబార్డినేట్లుగా నియమించారు. కొత్తగా వచ్చే వీఆర్వో పోస్టులు జూనియర్ అసిస్టెంట్ స్థాయి అని రెవెన్యూ ఉద్యోగుల్లో ప్రచారం అవుతున్నా ప్రభుత్వం మాత్రం స్పష్టత ఇవ్వడం లేదు.

3) నిర్ణీత అర్హత అంటే ఏమిటి?

సీసీఎల్ఏ ఇటీవల జారీచేసిన ఉత్తర్వుల్లో పూర్వ వీఆర్వోలు, వీఆర్ఏల్లో 'నిర్ణీత అర్హత' ఉన్నవారి నుంచి విల్లింగ్ తీసుకోవాలని ఆదేశించారు. కానీ ఆ అర్హత ఏమిటన్నది స్పష్టత లేదు. పాత సిబ్బందిలో ప్రాథమిక విద్యాభ్యాసం మొదలు పీజీ వరకు విద్యాభ్యాసం కలిగిన వారు ఉన్నారు. మరి కొత్త వీఆర్వో పోస్టులకు కనీస అర్హత ఏమి టో నిర్ణయించకుండా విల్లింగ్ లెటర్ ఎందుకు తీసుకుంటున్నట్టు? అని ప్రశ్నిస్తున్నారు.

4) సర్వీస్ కొనసాగుతుందా?

వీఆర్వోలు దాదాపు రెండున్నరేండ్లుగా వివిధ శాఖల్లో పనిచేస్తున్నారు. వీఆర్ఏలను సైతం కేసీఆర్ ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తూ గతేడాది సర్దుబాటు చేసింది. వారు దాదాపు ఏడాదిన్నరగా వివిధ హోదాల్లో విధులు నిర్వర్తిస్తున్నారు. కొత్తగా వచ్చే వీఆర్వో వ్యవస్థలో చేరితే ఈ సర్వీస్ ఉంటుందా? మళ్లీ మొదటి నుంచి ప్రారంభించాల్సి వస్తుందా? అనే సందేహాలు ఉద్యోగుల్లో ఉన్నాయి. కానీ ఇప్పటివరకు దీనిపై ప్రభుత్వానికే స్పష్టత లేదు. పాత సర్వీస్‌ను పరిగణనలోకి తీసుకుంటేనే సీనియారిటీ కొనసాగుతుందని, భవిష్యత్తులో తమకు అవకాశాలు వస్తాయని ఉద్యోగులు చెప్తున్నారు.

5) పాత సర్వీస్ సంగతి?

గతంలో తాము దశాబ్దాలపాటు వీఆర్వోలుగా పనిచేశామని, ఇప్పుడు మళ్లీ వీఆర్వో వ్యవస్థను తెస్తున్న నేపథ్యంలో పాత సర్వీస్‌ను కొనసాగించాలని కొందరు పూర్వ వీఆర్వోలు డిమాండ్ చేస్తున్నారు. రెండున్నర దశాబ్దాల క్రితం జరిగిన సర్దుబాటు తర్వాత కాలాన్ని మాత్రమే పరిగణనలోకి తీసుకుంటే తాము అన్యాయం అవుతామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

6) డిప్యూటేషనా? శాశ్వత నియామకమా?

పూర్వ వీఆర్వోలు, వీఆర్ఏల్లో ఇంటర్, డిగ్రీలో గణితం చదివిన వారిని సర్వేయర్లుగా నియమిస్తామని ప్రభుత్వం చెప్తున్నది. శాశ్వత నియామకమా? లేదా వీఆర్వోలుగా తీసుకొని డిప్యూటేషన్ ఇస్తారా? అన్నదానిపై స్పష్టత లేదు. వాస్తవానికి సర్వేయర్ల పోస్టులకు సాంకేతికంగా ఈ విద్యార్హత సరిపోదు. కాబట్టి భవిష్యత్తులో ఎదురయ్యే న్యాయ సమస్యలను ఎలా పరిష్కరిస్తారని ప్రశ్నిస్తున్నారు.

నిరుద్యోగులకు అన్యాయం

పూర్వ వీఆర్వోలు, వీఆర్ఏలను సర్వేయర్లుగా నియమించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఇంటర్, డిగ్రీలో గణితం చదివిన వారిని సర్వేయర్లుగా నియమిస్తున్నట్టు తెలిపింది. అర్హత ఉన్న వారి నుంచి ఆప్షన్లు స్వీకరిస్తున్నది. ఈ విద్యార్హతలపై నిరుద్యోగులు మండిపడుతున్నారు. ప్రభుత్వం తమకు తీవ్ర అన్యాయం చేస్తున్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్హతలతో సంబంధం లేకుండా ఎలా తీసుకుంటారని ప్రశ్నిస్తున్నారు. 2017 జూన్‌లో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నుంచి సర్వే సెటిల్మెంట్, ల్యాండ్ రికార్డ్స్ విభాగంలో 273 డిప్యూటీ సర్వేయర్ పోస్టులకు నోటిఫికేషన్ వెలువడింది. దీని ప్రకారం డ్రాఫ్ట్స్‌మెన్ (సివిల్), ఐటీఐ సివిల్ డ్రాఫ్ట్స్‌మెన్ , ఇంటర్ వొకేషనల్‌లో కన్‌స్ట్రక్షన్ టెక్నాలజీ, సివిల్ ఇంజినీరింగ్‌లో బీటెక్, ఎంటెక్, ఎంఈ చేసినవారు అర్హులని పేర్కొన్నది. కానీ ప్రభు త్వం ప్రస్తుతం సర్వేయర్ పోస్టులకు మ్యా థ్స్ చదివిన వారిని ఎంపిక చేస్తుండటం చట్ట విరుద్ధమని స్పష్టంచేస్తున్నారు. పూర్వ వీఆర్వోలు, వీఆర్ఏల్లో నిర్దిష్ట అర్హతలు ఉన్నవారిని తీసుకుంటే తమకు అభ్యంతరం లేదని అంటున్నారు. మిగతా పోస్టులను టీజీపీఎస్సీ ద్వారానే భర్తీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

సర్కారు మొండి పట్టుదల

మొత్తంగా భూ భారతి బిల్లుతో తీసుకొచ్చే కొత్త వీఆర్వో వ్యవస్థ అటు ప్రజల్లోనే కాకుండా, ఇటు పూర్వ వీఆర్వోలు, వీఆర్ఏల్లోనూ అనేక అనుమానాలను కలిగిస్తున్నది. వీటిపై అటు ప్రభుత్వం నుంచిగానీ, ఇటు రెవెన్యూ శాఖ నుంచి స్పష్టత ఇవ్వడంలేదు. కేవలం కేసీఆర్ ప్రభుత్వం రద్దుచేసింది కాబట్టి తాము ఏర్పాటుచేయాలనే మొండి పట్టుదల తప్ప ప్రభుత్వం వద్ద స్పష్టమైన ప్రణాళిక లేదని విమర్శలు వినిపిస్తున్నాయి.

సర్వేయర్లుగా వీఆర్వోలను నియమిస్తారా?

- అవగాహన లేనివారిని నియమిస్తే సమస్యలు
- ప్రభుత్వం పునరాలోచించాలని సర్వేయర్ల డిమాండ్

ఖలీల్‌వాడి, డిసెంబర్ 27: అవగాహన లేని వారిని సర్వేయర్లుగా నియమిస్తే ఊరుకునేది లేదని, ఆందోళనలు చేస్తామని ప్రభుత్వ సర్వేయర్లు హెచ్చరించారు. నిజామాబాద్ జిల్లాలో సర్వే ల్యాండ్ రికార్డ్స్ డిపార్ట్‌మెంట్‌లో పని చేస్తున్న సర్వేయర్లు శుక్రవారం జిల్లా కేం ద్రంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన భూమాత అమలుపై, సర్వేఅండ్ ల్యాం డ్ రికార్డ్స్ డిపార్ట్‌మెంట్‌లో నూతనంగా చేపట్టనున్న నియామకాలపైనా చర్చ జరిగింది. తెలంగాణ గెజిటెడ్ అసోసియేష న్ జిల్లా అధ్యక్షుడు అలుక కిషన్ మాట్లాడుతూ.. సర్వేయర్లను నియమిస్తామన్న ప్రభుత్వ ప్రకటనను స్వాగతిస్తున్నామన్నారు. గతంలో పనిచేసిన వీఆర్వోలకు అవకాశం కల్పిస్తామని రెవెన్యూ శాఖ మంత్రి ప్రకటించడంపై అభ్యంతరం తెలిపారు. ఎలాంటి టెక్నికల్ నాలెడ్జ్ లేని వా రిని నియమిస్తే ఇబ్బందులు తలెత్తుతాయని చెప్పారు. ప్రభుత్వం భూసమస్యలు లేకుండా చేస్తానని చెబుతూనే, కొత్త సమస్యలు సృష్టించడం సరికాదని చెప్పారు. కర్ణాటకలో చేపట్టిన విధానాన్ని ఇక్కడా అమలు చేస్తామనడం సరికాదన్నారు.

పార్టీ కోసం కష్టపడే వారికి గుర్తింపు లేదు

ఎన్ఎస్‌యూఐ నేత నిరంజన్‌బాబా

వనపర్తి టౌన్, డిసెంబర్ 27 : కాంగ్రెస్ పార్టీలో పనిచేసే వారికి సముచిత స్థానం లేదని ఎండీ నిరంజన్ బాబా శుక్రవారం తీవ్ర మనస్తాపంతో మీడియా ముందు ఆవేదన వెలిబుచ్చారు. ఎన్ఎస్‌యూఐ కార్యకర్తగా, జిల్లా , యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిగా .. పార్టీ అభివృద్ధి కోసం 18 ఏండ్లుగా పని చేసినా ఎలాంటి పదవి లభించలేదని వాపోయారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక పార్టీ పదవులకు అర్హులం కాదా..? అని ప్రశ్నించారు. కాంగ్రెస్‌లో పనిచేయని నాయకులకు పదవులు వస్తున్నాయని, ఇదెక్కడి న్యాయమని నిలదీశారు. వనపర్తి కోర్టులో న్యాయవాదిగా చాలాకాలంగా పనిచేస్తున్నా.. కోర్టులో అదనపు గవర్నమెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్(ఏజీపీ) పదవి ఆశించినా తనకు దక్కకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురైనట్టు చెప్పారు.

నాగర్‌కర్నూల్ జిల్లా నేరళ్లపల్లిలో మాజీ ఎమ్మెల్యే జనార్దన్‌రెడ్డి తండ్రి జంగిరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎంపీ సంతోష్‌కుమార్, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి,

మర్రిని పరామర్శించిన సంతోష్

- జంగిరెడ్డి చిత్రపటం వద్ద మాజీ ఎంపీ నివాళి

తిమ్మాజిపేట, డిసెంబర్ 27 : తండ్రిని కోల్పోయిన నాగర్‌కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డిని మాజీ ఎంపీ సంతోష్‌కుమార్ పరామర్శించారు. శుక్రవారం తిమ్మాజిపేట మండలం నేరళ్లపల్లికి ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి వెళ్లిన ఆయన మర్రి తండ్రి జంగిరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పించారు. దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎంపీ మలోతు కవిత మర్రిని పరామర్శించారు.

వీఆర్వోలు, వీఆర్ఏలు నాట్ విల్లింగ్!

- వెనక్కివచ్చేందుకు నేటితో ముగియనున్న గడువు
- సర్వీస్ రూల్స్ లేకపోవడంతో తర్జన భర్జన

హైదరాబాద్, డిసెంబర్ 27(నమస్తే తెలంగాణ): గ్రామాల్లో కొత్తగా వీఆర్వోలుగా పనిచేసేందుకు పూర్వ వీఆర్వోలు, వీఆర్ఏలు పెద్దగా ఆసక్తి కనబరచడం లేదని రెవెన్యూవర్గాలు చెప్తున్నాయి. ఇతర శాఖల్లో పనిచేస్తున్న పూర్వ వీఆర్వోలు, వీఆర్ఏలు తిరిగి వచ్చేందుకు విల్లింగ్ ఇవ్వాలని సీసీఎల్ఏ ఇటీవల ఆదేశించిన సంగతి తెలిసిందే. ఈ గడువు శనివారంతో ముగియనున్నది. రాష్ట్రవ్యాప్తంగా 10,434 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. ఒక్కో గ్రామానికి ఒక వీఆర్వోను నియమించాలని, మరో వెయ్యి మందిని సర్వేయర్లుగా తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. దాదాపు 11,500 మందిని తిరిగి రెవెన్యూ శాఖలోకి తేవాలని భావించింది. గతంలో ఇతర శాఖల్లోకి సర్దుబాటు అయిన వీఆర్వోలు, వీఆర్ఏలు కలిపి దాదాపు 24 వేల మంది వరకు ఉన్నారు. దీంతో కుప్పులుతెప్పలుగా దరఖాస్తులొస్తాయని ప్రభుత్వం భావించింది. ప్రభుత్వం అంచనాలను తలకిందులు చేస్తూ ఇప్పటివరకు 3,500 మంది వరకు మాత్రమే విల్లింగ్ ఇచ్చినట్టు రెవెన్యూ వర్గాలు తెలిపాయి. నూతన వీఆర్వో వ్యవస్థకు సంబంధించి సర్వీస్ రూల్స్ నిర్ధారణ కాకపోవడమే ఇందుకు ప్రధాన కారణంగా చెప్తున్నారు. 'ముందు చేరండి.. ఆ తర్వాత బాధ్యతలు, సర్వీస్ నిబంధనలు తెలుస్తాయి' అంటూ ఉన్నతాధికారులు చెప్తున్నారట. అసలు తమ పని ఏమిటో తెలియకుండా ఎందుకు వెళ్లాలని పాత వీఆర్వోలు, వీఆర్ఏలు భావిస్తున్నారు. పైగా గతంలో కన్నా అధికారాలు తక్కువగా ఉండటం కూడా మరో కారణంగా చెప్తున్నారు. విద్యార్హతలు వంటి సాంకేతిక అడ్డంకులు ఉండటంతో సర్వేయర్ పోస్టులో చేరేందుకు వెనుకంజ వేస్తున్నట్టు సమాచారం.

అలంపూర్‌లోని జోగుళాంబ ఆలయంలో జడ్జి కుటుంబ సభ్యులు, అధికారులు

జోగుళాంబ సన్నిధిలో సుప్రీంకోర్టు జడ్జి

అలంపూర్, డిసెంబర్ 27 : అష్టాదశ శక్తిపీఠాల్లో ఐదో శక్తి పీఠమైన అలంపూర్‌లోని జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయాలను శుక్రవారం సుప్రీంకోర్టు జడ్జి ఎస్‌వీఎన్ భట్టి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ పాలక మండలి కమిటీ చైర్మన్ నాగేశ్వర్‌రెడ్డి, ఈవో పురేందర్‌కుమార్ స్వాగతం పలికి, జోగుళాంబ జ్ఞాపికను అందజేశారు. వారి వెంట గద్వాల డీఎస్పీ సత్యనారాయణ, అలంపూర్ సీఐ రవిబాబు, ఎస్సై వెంకటస్వామి, తాసీల్దార్ మంజుల ఉన్నారు.

ఈ ఏడాది 41 రోజులు భారీ ఎండలు

వాషింగ్టన్, డిసెంబర్ 27: ఈ ఏడాది ఎండలు మండిపోయాయని.. వాతావరణ మార్పుల వల్ల సగటున 41 రోజులు అదనంగా ఎండలను భరించాల్సి వచ్చిందని శాస్త్రవేత్తలు తెలిపారు. మానవ కార్యకలాపాల వల్ల పెరుగుతున్న వాతావరణ మార్పులపై పరిశోధన చేసిన సైంటిస్టులు గత అధ్యయనాల ఆధారంగా ఈ విషయాలను వెల్లడించారు. 'ఈ పరిణామం ఆశ్చర్యం కలిగించకపోయినా ఆందోళనకరం. వాతావరణ మార్పుల కారణంగా ప్రపంచవ్యాప్తంగా లక్షలాది ప్రజల జీవితాలు, జీవనోపాధులు తీవ్రంగా ప్రభావితమవుతున్నాయి' అని వరల్డ్ వెదర్ అట్రిబ్యూషన్ అండ్ యాన్ ఇంపీరియల్ కాలేజ్ వాతావరణ శాస్త్రవేత్త ఫ్రెడరిక్ ఒట్టో అన్నారు.

బుచ్చయ్య(ఫైల్)

వివరాలు సేకరిస్తున్న సీఐ నాగార్జునరావు, (ఇన్‌సెట్)

కాటారంలో మరో భూ హత్య

- దారి కాచి.. దాడిచేసిన ప్రత్యర్థులు
- తీవ్రగాయాలతో డోంగిరి బుచ్చయ్య మృతి
- కలవరపెడుతున్న వరుస ఘటనలు

కాటారం, డిసెంబర్ 27 : జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలో ఇటీవల వరుసగా జరుగుతున్న భూ తగాదా హత్యలు ప్రజలను కలవరపెడుతున్నాయి. శుక్రవారం కాటారం మండలకేంద్రానికి చెందిన డోంగిరి బుచ్చయ్య (57) దారుణ హత్యకు గురయ్యాడు. భూ తగాదాలతో దారి కాచి మరీ దారుణంగా హత్య చేశారు. మృతుడి భార్య సారమ్మ, పోలీసుల కథనం ప్రకారం.. ఇప్పలగూడేనికి చెందిన డోంగిరి బుచ్చయ్యకు గ్రామంలోని సర్వే నంబర్ 501లో ఎకరం 10 గుంటల వ్యవసాయ భూమి ఉంది. సరిహద్దు విషయంలో అదే గ్రామానికి చెందిన సొదారి పోచయ్య, అతని కుమారులు సమ్మయ్య, అంకయ్య, లింగయ్య మధ్య మూడేళ్లుగా భూ వివాదం జరుగుతున్నది. గతంలో పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీలు జరిగినా సమస్య పరిష్కారం కాలేదు. గత మేలో బుచ్చయ్య కాటారం పోలీస్‌స్టేషన్‌లో భూ వివాదంపై ఫిర్యాదు చేశాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం బుచ్చయ్య పొలం వద్ద ఉండగా లింగయ్య, అతని భార్య శోభ అక్కడకు వెళ్లి కావాలని గొడవ పెట్టుకున్నారు. ఈ విషయాన్ని బుచ్చయ్య ఫోన్ చేసి చెప్పడంతో ఇద్దరు కూతుళ్లు సుగంధ, శోభను తీసుకొని సారమ్మ పొలం వద్దకు వెళ్లింది. బుచ్చయ్యను చంపితేనే తమకు భూమి దక్కుతుందని భావించిన సొదారి లింగయ్య, అతని కుమారుడు పవన్, భార్య శోభ అప్పటికే ఇప్పలగూడెం హనుమాన్ గుడి వద్ద కాపు కాచారు. బుచ్చయ్య పొలం వద్ద నుంచి తిరిగి వస్తుండగా మార్గమధ్యంలో పెద్ద దుంగతో తలపై కొట్టగా కిందపడిపోయి తీవ్రంగా గాయపడ్డాడు. ఇదే సమయంలో అక్కడకు చేరుకున్న సారమ్మ, ఇద్దరు కూతుళ్లు అరవడంతో నిందితులు పారిపోయారు. కాగా, రక్తపు మడుగులో కొన ఊపిరితో ఉన్న బుచ్చయ్యను హుటాహుటిన భూపాలపల్లి 100 పడకల ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే చనిపోయినట్లు వైద్యులు చెప్పారు. అయితే స్థానికుల కథనం ప్రకారం.. శుక్రవారం ఉదయం బుచ్చయ్యకు లింగయ్య, అతని భార్య శోభకు మధ్య భూమి విషయంలో గొడవ జరిగింది. వివాదం ముదిరి ఒకరిపై ఒకరు దాడి చేసుకోగా ఇరువురికి గాయాలయ్యాయి. ఈ విషయాన్ని బుచ్చయ్య తన కుటుంబ సభ్యులకు, లింగయ్య తన కుటుంబ సభ్యులకు చెప్పడంతో వారు పొలం వద్దకు బయల్దేరారు. ఈ క్రమంలో లింగయ్య కొడుకు పవన్‌కు బుచ్చయ్య ఎదురుకావడంతో క్షణికావేశంలో దాడికి పాల్పడగా అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనా స్థలాన్ని సీఐ నాగార్జునరావు పరిశీలించి వివరాలు సేకరించారు. మృతుడి భార్య సారమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నాగార్జున రావు, ఎస్సై-2 శ్రీనివాస్ తెలిపారు. పోలీసుల విచారణలో పూర్తి వివరాలు తెలియనున్నాయి.

మొన్న దేవరాంపల్లి.. నేడు కాటారంలో...

కాటారం మండలంలో వరుస హత్యలు కలవరపెడుతున్నాయి. 15 రోజుల క్రితం దేవరాంపల్లిలో ఐదు గుంటల భూమికోసం తోడబుట్టిన వారినే నరికి హత్య చేసిన ఘటన మరువక ముందే శుక్రవారం కాటారంలో మరో దారుణ హత్య జరగడం ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. ఈ హత్యలకు భూతగాదాలే కారణం కావడం గమనార్హం. కుటుంబ సభ్యులు, సన్నిహితులే క్షణికావేశంలో ప్రాణాలు తీస్తున్నారు.

బాధ్యులపై చర్యలు తీసుకుంటాం..

మండలంలో ఫారెస్ట్ భూములను నరికి పోడు చేస్తున్న ఘటనపై విచారణ చేపడుతాం. స్టైంచ్ కటింగ్‌ను పూడ్చడం నేరం. ప్రభుత్వ నిబంధనలను అతిక్రమిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించం. అలాగే విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ, పోడుకు సహకరిస్తున్న బీట్ ఆఫీసర్లపై విచారణ చేపట్టి కఠిన చర్యలు తీసుకుంటాం. అడవుల నరికి వేత పర్యావరణానికి గొడ్డలి పెట్టు. ప్రతి ఒక్కరూ అడవుల సంరక్షణకు పాటు పడాలి.

– రవికిరణ్, ఫారెస్ట్ రేంజ్ అధికారి, నర్సంపేట

లైన్‌తండ శివారులో ఓ వ్యక్తి ఫారెస్ట్‌ను ధ్వంసం చేసి చదను చేసిన భూమి

అటవీ సంపదపై గొడ్డలి వేటు

- చెట్లను నరికి, ట్రెంచ్ కటింగ్‌ను పూడ్చి పోడుకు యత్నం
- సహకరిస్తున్న కొందరు బీట్ ఆఫీసర్లు
- చోద్యం చూస్తున్న ఫారెస్ట్ అధికారులు

నల్లబెల్లి, డిసెంబర్ 27 : అటవీ సంపదపై మళ్లీ గొడ్డలి వేటు మొదలైంది. కొందరు యథేచ్ఛగా చెట్లను నరికి పోడుకు యత్నిస్తున్నారు. కొందరు అధికారుల అండతోనే ఈ తతంగం నడుస్తున్నా, పట్టించుకునే వారే కరువయ్యారని పరిసర ప్రాంతాల ప్రజలు ఆరోపిస్తున్నారు. బీఆర్ఎస్ హయాంలో అప్పటి సీఎం కేసీఆర్ బృహత్తరమైన ఆలోచనతో ఎన్నో ఏండ్లుగా పోడు వ్యవసాయం చేసుకున్న రైతులను గుర్తించి పట్టాలు అందజేశారు. దీంతోపాటు ఫారెస్ట్ భూముల చుట్టూ ట్రెంచ్ కటింగ్ పనులు చేయించారు. దీంతో గత కొంతకాలంగా పోడు వ్యవసాయానికి ప్రజలు స్వస్తి పలికారు. కానీ, ఇప్పుడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం పట్టింపులేనితనం కారణంగా మళ్లీ అడవిలో చెట్ల నరికివేత యథేచ్ఛగా జరుగుతున్నది. వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం గోవిందాపూర్ పరిధి లైన్ తండా శివారులో కొందరు రైతులు రాత్రి సమయంలో ఫారెస్ట్ భూముల్లో చెట్లను నరికి, డోజర్లతో చదును చేసి పోడు వ్యవసాయానికి తెగబడుతున్నారు. ఏకంగా ఫారెస్ట్ భూముల్లో ఏర్పాటు చేసిన ట్రెంచ్‌ను సైతం పూడ్చివేస్తున్నారు. మండలంలోని ఫారెస్ట్ భూములను ఆ శాఖ ఐదు బీట్లుగా విభజించి, ఒక్కో ఫారెస్ట్ అధికారిని బీట్ ఆఫీసర్లుగా నియమించింది. అయితే కంచె చేను మేసిందన్న చందంగా పోడుకు యత్నిస్తున్న వ్యక్తులతో బీట్ ఆఫీసర్లు కుమ్మక్కై వారికి సహకరిస్తున్నారని స్థానిక రైతులు ఆరోపిస్తున్నారు. అలాగే, ఇదే ఫారెస్ట్‌శాఖ తమ భూముల రక్షణ కోసం అటవీ భూముల పరిరక్షణ (ఎఫ్ఆర్సీ) కమిటీలను సైతం ఏర్పాటు చేసింది. ఈ కమిటీల పర్యవేక్షణ కూడా లేకపోవడంతో ఫారెస్ట్ భూములు పోడు భూములుగా మారుతున్నాయి. ఇలాంటి ఘటనలకు చరమగీతం పాడేలా గత ప్రభుత్వం పోడు రైతులకు పట్టాలను మంజూరు చేయడంతోపాటు కరెంట్, బోర్లు వేసుకునేందుకు అనుమతి ఇచ్చింది. కానీ, నల్లబెల్లి మండలంలో బీట్ ఆఫీసర్ల కనుసన్నల్లో కొందరు అడవిని నరికి పోడు చేస్తున్నారని పరిసర ప్రాంతాల రైతులు ఆరోపిస్తున్నారు. ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఫారెస్ట్ భూములను రక్షించడంతోపాటు పోడు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ఆర్థిక రంగ నిపుణుడు మన్మోహన్‌సింగ్

నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

నర్సంపేట: దేశం ఆర్థికంగా క్లిష్ట సమయంలో ఉన్నప్పుడు దివంగత మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు తెచ్చిన ఆర్థిక సంస్కరణలను అమలు చేయడంలో ఆర్థిక రంగ నిపుణుడిగా మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ తన విద్వత్తును ప్రదర్శించారని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి తెలిపారు. మన్మోహన్‌సింగ్ మరణంపై శుక్రవారం పెద్ది దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పీవీ మనస్సు గెలిచిన మన్మోహన్‌సింగ్ అనేక ఉన్నత శిఖరాలకు చేరుకున్న భరత మాత బిడ్డ అని కొనియాడారు. ప్రధానిగా డాక్టర్ మన్మోహన్‌సింగ్ హయాంలోనే తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కావడం చారిత్రక సందర్భమన్నారు. మిత భాషిగా, అత్యంత సౌమ్యుడిగా, జ్ఞానాన్ని సొంతం చేసుకున్న స్థిత ప్రజ్ఞత కలిగిన నేతగా ప్రధానిగా మన్మోహన్‌సింగ్ దేశానికి అందించిన సేవలు గొప్పవనారు. తెలంగాణ ఉద్యమాన్ని, ప్రజల మనోభావాలను అర్థం చేసుకొని తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు సంపూర్ణ మద్దతు ప్రకటించారని గుర్తుచేసుకున్నారు. ఆయన మరణం దేశానికి తీరని లోటన్నారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులకు పెద్ది సుదర్శన్‌రెడ్డి తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

తాడ్వాయి: బడే చొక్కారావు తల్లితో మాట్లాడుతున్న ఎస్పీ శబరీష్

అరణ్యం వీడి... జనంలోకి రండి

- పోలీస్ శాఖ పరంగా అన్ని విధాలుగా ఆదుకుంటాం
- బడే చొక్కారావు తల్లి, ఆజాద్ కుటుంబాన్ని పరామర్శించిన ములుగు జిల్లా ఎస్పీ శబరీష్

గోవిందరావుపేట/ తాడ్వాయి, డిసెంబర్ 27: ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని కాల్వపల్లి గ్రామానికి చెందిన మావోయిస్టు పార్టీ రాష్ట్ర కమిటీ కార్యదర్శి బడే చొక్కారావు అలియాస్ దామోదర్ తల్లి బడే బతుకమ్మను, గోవిందరావుపేట మండలం మొద్దులగూడెం గ్రామానికి చెందిన మావోయిస్టు రాష్ట్ర నేత కొయ్యల సాంబయ్య అలియాస్ ఆజాద్ కుటుంబాన్ని శుక్రవారం ములుగు జిల్లా ఎస్పీ డాక్టర్ పీ శబరీష్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. అరణ్యం వీడి.. జనంలోకి రావాలని మావోయిస్టులకు పిలుపునిచ్చారు. పోరు కన్నా ఊరు మిన్న అని, చొక్కారావు జనజీవన ప్రవంతిలో చేరి తల్లిని చూసుకోవాలన్నారు. ప్రస్తుతం బతుకమ్మ ఆరోగ్యం బాగాలేదని, ఇల్లు లేదని, ఆమెను ఎవరూ చూసుకోవడం లేదని తన దృష్టికి వచ్చిందన్నారు. ప్రశాంతమైన జీవనం గడిపేందుకు లొంగిపోవాలని, వారికి ప్రభుత్వం తరపున పునరావాసం కల్పిస్తామని, పోలీసు శాఖ పరంగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం బతుకమ్మతోపాటు ఆజాద్ కుటుంబానికి నిత్యావసర సరుకులు అందజేశారు.

రాష్ట్ర స్థాయి జూనియర్ కబడ్డీ పోటీలు షురూ..

జనగామ చౌరస్తా, డిసెంబర్ 27 : జిల్లా కేంద్రంలోని ప్రెస్టన్ స్కూల్ మైదానంలో శుక్రవారం 50వ రాష్ట్ర స్థాయి జూనియర్ బాయ్స్ కబడ్డీ పోటీలు ప్రారంభమయ్యాయి. రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ ఆదేశాల మేరకు జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహిస్తున్నారు. వేడుకల ఆరంభానికి ముందు మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ స్మారకార్థం నిర్వాహకులు, క్రీడాకారులు మౌనం పాటించి సంతాపం తెలిపారు. ఫ్లడ్ లైట్స్ వెలుతురులో మ్